క్లుప్తంగా

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన దద్దాల



సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దద్దాల

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లి కార్యాలయంలో మంగళవారం పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించారు. అనంతరం రామకృష్ణారెడ్డిని సన్మానించారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలరెడ్డి, హెచ్‌ఎంపాడు మండలం నాయకులు దిరిశనం పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

355 బేళ్ల తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 355 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అనకర్లపూడి, పెరిదేపి, ముప్పరాజుపాలెం, మిట్టపాలెం గ్రామాలకు చెందిన రైతులు 980 బేళ్లను తీసుకురాగా 625 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 355 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.159గా నమోదైంది. వేలంలో 21 కంపెనీలు పాల్గొన్నాయి.

ఎంఈవో కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న వెంకటసుబ్బయ్య

ఉలవపాడు: స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని నెల్లూరు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడారు. విద్యాంజలి, విద్యాశక్తి కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అడిగారు. కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం కరేడులోని కస్తూరిబా విద్యాలయాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. భోజనం ఎలా పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎంవో సుధీర్, ఎంఈఓ రమణయ్యలు ఉన్నారు.

లో ఓల్టేజీ పరిష్కారానికి సబ్‌స్టేషన్ల నిర్మాణం

టంగుటూరు: గ్రామాల్లో లో ఓల్టేజీ పరిష్కారానికి విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని జేసీ మంగళవారం పరిశీలించారు. సర్వే నంబర్ 83లో 0.50 సెంట్ల భూమిని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తహసీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ రవి, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టండి

కనిగిరిరూరల్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాల ఫీజులు ఇలా అనేక రకాల ఫీజుల పేరిట నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నా.. అధికారులు పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. సెలవు దినాల్లో విద్యాసంస్థలు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు మౌనం దాల్చుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా డీఈఓ స్పందించి ప్రక్షాళన చేయకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిసుక్కుమనని కియోస్క్ యంత్రాలు

- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా యంత్రాలు
- వాటి నిర్వహణను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం

పీసీపల్లి:

కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. ఏడాది పాలనలో రైతుల సంక్షేమం కోసం తీసుకున్న మంచి నిర్ణయం ఒక్కటంటే ఒక్కటి లేదు. పైగా గత ప్రభుత్వ హయాంలో రైతుల కోసం ప్రవేశపెట్టిన ఎన్నో సంస్కరణలను నిలిపివేసింది. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు మేలు చేసేందుకు రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. రైతులు విత్తనాలు, ఎరువులను నేరుగా వారి గ్రామం నుంచే పొందేందుకు ఈ ఆధునిక యంత్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. నూతన ఆవిష్కరణలతో డిజిటల్ విధానంలో గత ప్రభుత్వం లక్షలాదిరూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేసింది. ఈ యంత్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతులు పంటలను ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు వంటివి ఈ యంత్రం ద్వారా తెలుసుకునేందుకు వీలుండేది. ఏ సమయంలో ఏ పంట వేయాలన్న వివరాలూ కూడా అందేవి.

కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో రైతులకు విరివిగా సేవలందించిన ఈ యంత్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. ఓ పక్క రైతు సేవా కేంద్రాల నిర్మాణాలు నిలిచిపోగా.. పూర్తయిన వినియోగంలో ఉన్న కేంద్రాల్లో యంత్రాల నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా గత ప్రభుత్వం రైతులకు ఎంతో సేవలందించిన ఈ యంత్రాలు ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా దర్శనమిచ్చే పరిస్థితి నెలకొంది.

పనిచేస్తున్నవి కొన్నే..

కనిగిరి నియోజకవర్గంలో 86 రైతు సేవా కేంద్రాలున్నాయి. వాటిలో కేవలం 30 కియోస్క్ యంత్రాలు పనిచేస్తున్నాయి. మిగిలినవి నిరుపయోగంగా మూలనపడి ఉన్నాయి. కూటమి సర్కారు రైతు సేవా కేంద్రాలకు ఎలాంటి యూరియా నిల్వలు ఉత్పత్తులు ఆశించిన స్థాయిలో సరఫరా చేయకపోవడం యంత్రాలకు



పీసీపల్లి రైతు భరోసా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం



రాయితీ ఎరువులు రాక ఖాళీగా ఉన్న రైతు భరోసా కేంద్రంలో రేఖలు

ఇంటర్నెట్ సౌకర్యం కల్పించకపోవడం అవి కాస్త నిరుపయోగంగా మారాయి. ఏడాదికాలం గా ప్రభుత్వం వీటి ఆలనా పాలన పట్టించుకునే వారే కరువయ్యారు. నియోజకవర్గంలో సగానికి పైగా యంత్రాలు పనిచేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లక్షల రూపాయల ప్రజాధనం వినియోగించి కొనుగోలు చేసిన ఈ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మండలం	రైతు సేవా కేంద్రాలు	యోస్కులు పనిచేస్తున్నవి
కనిగిరి	17	5
హెచ్ఎం పాడు	14	6
వెలిగండ్ల	10	4
పామూరు	19	4
సీఎస్‌పురం	3	5
పీసీపల్లి	13	6

7వ రోజుకు చేరిన సమ్మె

కనిగిరిరూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారంతో 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్రంగా వైఫల్యం చెందిందన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలని, మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించాలని, సంక్రాంతి కానుకలు, పనిముట్లు, దుస్తులు అందచేయాలని, చనిపోయిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి మాట్లాడగా.. సమస్యల పరిష్కారానికి తనవంతు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమ్మెను విరమించి విధుల్లో చేరాలని తెలిపారు. యూనియన్ ఆదేశాల మేరకు సమ్మె విరమణ అంశాన్ని తెలియ చేస్తామని నాయకులు తెలిపారు. మున్సిపల్ యూనియన్, సీఐటీయూ నాయకులు చార్లస్, లక్ష్మయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మోసానికి బాబు బ్రాండ్ అంబాసిడర్



బాబు షూరిటీ మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



కార్యక్రమానికి హాజరైన నాయకులు కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

టంగుటూరు: మోసానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ మండల విస్తృత సమావేశం, బాబు షూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ 13 నెలల కూటమి పాలనలో రాష్ట్రంలో పాలన గాడి తప్పిందన్నారు. హామీలు అమలు చేయకుండా అబద్ధాలు చెప్పడంతో సీఎం చంద్రబాబు గిన్నీస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కుతారన్నారు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనన్నారు. ఒక్క హామీని అమలు చేయకుండా అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఆడబిడ్డ పథకం కింద నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పి ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సిందేనని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇచ్చిన మాటకు కట్టుబడి 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. పేదల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలను ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేశారన్నారు. కానీ చంద్రబాబు మాత్రం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తూ ప్రజలను నిలువునా మోసం చేశాడని ధ్వజమెత్తారు. అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇలా ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, అందరం సమష్టిగా ముందుకు సాగి హామీలు అమలు చేసే వరకు పోరాటం చేద్దామన్నారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి బాబు మోసాలను వివరించాలని పిలుపునిచ్చారు. నాయకులంతా సమష్టిగా ముందుకు సాగితే 2029లో కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడుతుందన్నారు. అనంతరం నాయకులతో కలిసి బాబు షూరిటీ, మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుట్ట వెంకట్రావు, బుర్ర అంకమ్మరాజు, కొమ్ము ప్రభుదాసు, పరిటాల సునీల్, దగ్గుమాటి సుమన్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, తక్కెళ్లపాటి సుధాకర్, నిర్మల, బొడ్డు వాసంతి, దేవరపల్లి కావ్య, బిల్లా ఝాన్సీ, పులిచర్ల కోటయ్య, ఎస్‌కే నజీర్‌బాష, కొమ్ము బాబురావు, గుంతోటి శ్రీనివాసరావు, మధుమాల విష్ణు, శ్రీనివాసరెడ్డి, వాక వెంకట కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములు కావాలి



ప్రతిజ్ఞలో చైర్మన్ గఫార్, కమిషనర్, వ్యాపారులు

కనిగిరిరూరల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని దుకాణదారుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు, క్రయ విక్రయాలు, రవాణ, నిల్వ తదితర అన్ని అంశాలపై కఠిన చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి జరుగుతున్న హానీ, ముప్పు గురించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా జౌళీ, నార గుడ్డ, సంచులను వాడాలని సూచించారు. గోదాములపై, నిల్వలపై ఆకస్మిక దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. వివిధ సంస్థల ప్రతినిధులు, దుకాణ యజమానులు, టీ.గోవిందరావు, పవన్ కుమార్, రమేష్‌బాబు, బాదం సత్యం, సురేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మురళీ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పీసీపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై కోటయ్య



వేములపాడు బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు



కె.బిట్రగుంటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై



శీలంవారిపల్లె పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై నాయక్



వివేకా కళాశాలలో మాట్లాడుతున్న సీఐ భీమానాయక్



కొండపిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎన్.వెంకటేశ్వరనాయక్ అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్‌ప్లస్, మండలంలోని పెదరాజుపాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో మంగళవారం మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాలికలపై లైంగిక వేధింపులు మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈగల్‌క్లబ్ ఆవశ్యకత, బాలికలపట్ల లైంగిక వేధింపులకు సంబంధించి, ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న సైబర్ నేరాల గురించి, వాటిని ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఇలాంటి విషయాల్లో పూర్తి స్థాయిలో చైతన్యవంతులై ఉండాలని, తద్వారా సమాజానికి మేలు చేకూరుతుందన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్, ఇతర సంభాషణలకు బాలికలు దూరంగా ఉండాలని, తద్వారా బాలికల భద్రతకు భరోసా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ బోడా ప్రసాద్, రాజుపాలెం హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ ఓబయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీపల్లి: గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఎస్సై కోటయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే గిఫ్టులు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అవి కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం భీమానాయక్ హెచ్చరించారు. స్థానిక వివేకా డిగ్రీకళాశాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం అనుమానాస్పద, ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి మహాలక్ష్మయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపి: విద్యార్థి దశలోనే మంచి చెడుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెట్లూరులో సహజానంద హైస్కూల్ విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. . విద్యార్థినుల పట్ల చెడుగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కరస్పాండెంట్ ఏ శ్రీనివాసరావు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రోజు రోజుకి తిరస్కరణ బేళ్లు ఎక్కువవుతున్నాయి. ఒక పక్క బేళ్ల తిరస్కరణ, మరో పక్క లోగ్రేడు పొగాకు రోజురోజుకి తగ్గుతున్న ధరలను చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నిర్వహించిన వేలంలో 245 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. వేలం కేంద్రానికి కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1115 బేళ్లను తీసుకురాగా వాటిలో 870 కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ. 280 కాగా, కనిష్ట ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 214.41గా నమోదైంది. వేలంలో 9 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మహ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై ఎస్సై ఎం మాధవరావు అవగాహన కల్పించారు. వేములపాడు బస్టాండ్ సెంటర్‌లో ప్రజలతో మాట్లాడి అవగాహన కల్పించారు.

డ్రాపౌట్స్ నివారణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వారి పాఠశాలల పరిధిలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాల, సీఎస్‌పురం మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని మొత్తం 16 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో తరగతి గదులు, పెయింటింగ్, విద్యుత్, తాగునీరు, గ్రీన్‌బోర్డులు, డ్యూయల్ డెస్కులు వంటి అవసరాలను గుర్తించామన్నారు. దీనికి సంబంధించి వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పి వి.సతీష్ ఉన్నారు.

నూరుశాతం సబ్సిడీపై కంది కిట్లు

జరుగుమల్లి(సింగరాయకొండ): రైతులకు నూరుశాతం సబ్సిడీపై కంది కిట్లు అందజేయనున్నట్లు ఏఓ కాశీ విశ్వనాథ్ తెలిపారు. మండలానికి నాలుగు కేజీల కిట్లు 300 వచ్చాయన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ అసిస్టెంట్లను సంప్రదించి పొందాలని విజ్ఞప్తి చేశారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరిరూరల్:

తప్పులు తడకలు లేని పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు భాగస్వామ్యులు సహకరించాలని ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ల జాబితా తయారీ తదితర అంశాలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్‌కు ఆధార్ అనుసంధానం, తప్పులేని ఓటర్ల జాబితా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఎస్ శ్రీనివాసులరెడ్డి, బి.కోటేశ్వరరావు, తిరుమల, నరసింహులు, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల కోసం మా భూములు ఇవ్వం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గుడ్లూరు: పరిశ్రమల కోసం మా భూములు ఇవ్వమని రైతులు తెగేసి చెప్పారు. బలవంతపు భూసేకరణను నిరసిస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గుడ్లూరు మండలం రావూరులో పర్యటించారు. ఈ సందర్భంగా రావూరు రామాలయం గుడి దగ్గర సభ నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి ముసుగులో రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూ దోపిడీ జరుగుతోందన్నారు. అందులో భాగంగానే రావూరు గ్రామంలో కూడా భూ దోపిడీ జరుగుతుందని, ఆయన అన్నారు. కాకులను కొట్టి గద్దలకు వేసే విధంగా రైతుల భూములు కారు చౌకగా బలవంతంగా తీసుకొని, కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి మేము సహించమని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ గ్రామాలను స్మశానాలుగా మార్చడమే తప్ప అభివృద్ధి అంటూ ఏదీ లేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, తాళ్లూరి మాల్యాద్రి, సర్పంచ్ గొల్లపోలు సుబ్బరామయ్య, బిట్రగుంట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.